*కొంతకాలంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న నేరాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొందరు అధికారులు అవినీతి, హద్దులు దాటి వ్యవహరిస్తుండడంతో శాంతిభద్రతలు అదుపు తప్పతున్నాయి. నేరస్తులు, రౌడీలీడర్లతో చేతులు కలిపి సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారు. పేద, సామాన్యులు కష్టపడి కొనుగోలు చేసిన ప్లాట్లను కబ్జాదారులు కాజేస్తున్నారు. బాధితులు ఫిర్యాదులు చేసినప్పటికీ న్యాయం జరగడం లేదు. హత్యలు, హత్యాయత్నాలు, స్నాచింగ్‌లు, దోపిడీలు, గంజాయి, గుట్కా, పీడీఎస్ అక్రమ రవాణా, చిట్‌ఫండ్ సంస్థల మోసాలు.. ఈ సమస్యలన్నీ కొత్త పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌కు సవాళ్లుగా మారనున్నాయి.* - సుబేదారి, మార్చి 26

# పోలీసింగ్ మార్క్ కనబడేనా?



కమిషనరేట్ పరిధిలో లా అండ్ ఆర్డర్‌లో చాలా మంది ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు సుదీర్ఘకాలంగా పనిచేశారు. ఇందులో కొందరు కాసుల కోసం కక్కుర్తిపడి పోలీసు శాఖకు మచ్చ తెస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి 10 వరకు కొత్త బాస్ రాక ముందు ఇటీవల రోడ్లపై హత్యలు, హత్యాయత్నాలు, 36 చోరీలు,6 చైన్‌స్నాచింగ్‌లు, 48 గంజాయి, 22 లైంగిక దాడి,19 మహి ళల కిడ్నాప్, 91 వేధింపు కేసులు నమోదయ్యాయి. ఈ నేరాల నియంత్రణకు సహకరించకుండా కొందరు అధికారులు భూకబ్జాదారులు, పొలిటికల్ రౌడీలీడర్లు, రౌడీషీటర్లు, గుట్కా, పీడీఎస్ దందాలు చేసే వారి సంబంధాలు పెట్టుకొని నెలవారీ సంపాదనకు మరిగారు. కొందరైతే ఏకంగా పోస్టింగ్‌లు ఇప్పించిన నేతలు, వారి అనుచరులు ఆదేశాల మేరకే విధులు నిర్వర్తిస్తున్నారు. వరంగల్ నగరంలో ఓ ఏసీపీ, ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు ప్రజాప్రతినిధుల అనుచరులతో సంబంధాలు పెట్టుకొని సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది. ఈస్ట్‌జోన్ పరిధిలోని పరకాల, మామునూరు, నర్సంపేట డివిజన్ల పరిధిలోని ఓ ఏసీపీ, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, సెంట్రల్ జోన్ పరిధిలోని పనిచేస్తున్న ఓ ఏసీపీ, ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లపై అవినీతి ఆరోపణలున్నాయి. సదరు ఏసీపీ హద్దులు దాటి వ్యవహరించిన తీరు పత్రికల్లో వచ్చినా ఎలాంటి చర్యలు లేవు. ఓ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుకున్న వాహనాల యజమానుల నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్పెషల్ బ్రాంచ్, ఇంటలిజెన్స్‌లో ఇక్కడే పాతుకుపోయిన కొందరు అధికారులు క్షేత్రస్థాయిలో జరిగే వాస్తవ పరిస్థితుల నివేదికలను కమిషనర్, ప్రభుత్వానికి పంపించడం లేదనే విమర్శలున్నాయి. టాస్క్‌ఫోర్స్ విభాగం అధికారులు, సిబ్బంది కూడా గుట్కా, గంజాయి విక్రయదారులు, బియ్యం రీసైక్లింగ్‌కు పాల్పడే రైస్‌మిల్లర్స్, పీడీఎస్, కల్తీ సరుకుల దందాలు చేసే వ్యక్తులతో ఆర్థిక సంబంధాలు పెట్టుకొని, దాడులు చేసే క్రమంలో ముందుస్తుగా లీకులు ఇచ్చి సేఫ్‌జోన్‌లో ఉండేలా సహకరిస్తున్నట్లు సమాచారం. ఇక తూతూమంత్రంగా నైట్ పెట్రోలింగ్ చేస్తున్నారని నగరవాసులు ఆరోపిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్లు చాలా వరకు నగరంలో నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు ఇన్‌స్పెక్టర్లు ఇష్టానుసారంగా రావడం పోవడంతో రోజుల తరబడి బాధితులు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది.

### రౌడీలీడర్లతో చెట్టాపట్టాల్

నగరంలో పనిచేస్తున్న ఓ ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు ఎస్సైలు రౌడీలీడర్ల ఆదేశాల మేరకు నడుచుకుంటున్న పరిస్థితి ఉంది. ప్రజాప్రతినిధులు,రౌడీలీడర్లు భూ పంచాయతీలు,ఆర్థిక లావాదేవీల సెటిల్‌మెంట్ల కోసం ఫోన్ ఆదేశాలతో అనుచరులను ముందు పెట్టి స్టేషన్‌కు పంపిస్తున్నారు. హౌస్ ఆఫీసర్ ఎంత బీజీలో ఉన్నా వారిని వెంటనే సీట్లో కూర్చోబట్టి సెటిల్‌మెంట్ డీల్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. ఇవి నగరంతోపాటుగా రూరల్ ఏరియాల్లో కూడా జరుగుతున్నాయి. హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, భూ కబ్జాలకు పాల్పడి పొలిటికల్ ముసుగు వేసుకొని దందాలు చేసే రౌడీషీటర్లను పోలీసులు మందలించడం లేదు. వీరికి ప్రజాప్రతినిధుల సపోర్ట్ ఉండడంతో వారి దందాలకు చెక్ పెట్టలేకపోతున్నారు. కాగా, ఇటీవల సీపీ బాధ్యతలు చేపట్టిన సన్‌ప్రీత్ సింగ్ ప్రస్తుతం ఇక్కడి పరిస్థితులు, అధికారుల పనితీరుపై ఫోకస్ పెట్టారు. తొలుత లా అండ్ ఆర్డర్‌ను పూర్తిస్థాయిలో ట్రాక్‌లోకి తీసుకురావడంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తున్నది. వాస్తవ పరిస్థితిని తెలుసుకొని అవినీతి, నిబంధలు అతిక్రమించిన వారిపై పట్టుబిగించే ప్రయత్నంలో ఉన్నారు.

# జనగామకు మహిళా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఇవ్వండి

**అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి**



జనగామ, మార్చి 26(నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన జనగామలో మహిళా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో వివిధ అంశాలపై మాట్లాడిన ఆయన రోజురోజుకూ విస్తరిస్తున్న జిల్లా కేంద్రంలో మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో పంటలు ఎండిపోయినయ్ అని వాట్సాప్ వీడియోల్లో మాట్లాడితే రైతులను అరెస్ట్ చేసి జైల్లో పెడుతున్నారన్నారు. ఇటీవల తాను జనగామలో జైలును సందర్శిస్తే ఖైదీలు 40 మంది ఉంటే.. దాంట్లో 23 మంది కేవలం పంటలు ఎండిపోయాయని వీడియోల్లో మాట్లాడిన రైతులే ఉన్నారంటే కాంగ్రెస్ నిరంకుశ పాలనకు ఇదే నిదర్శనం అని అన్నారు.



రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడ

# తొర్రూరులో రియల్టర్ల గొడవ

**రోడ్డుకు అడ్డుగా అక్రమ నిర్మాణం**

తొర్రూరు, మార్చి 26 : తొర్రూరులో రియల్టర్ల మధ్య గొడవ కాస్త ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నది. ఓ స్థలం విషయంలో మనస్పర్థల కారణంగా పట్టణంలోని 14వ వార్డు సర్వినగర్‌లో ఏకంగా రోడ్డుకు అడ్డుగా గోడ నిర్మించడం వివాదాస్పదంగా మారింది. ఈ అక్రమ నిర్మాణంపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ పి.శాంతికుమార్ స్పందిస్తూ 'గోడ నిర్మాణంపై మాకు ఫిర్యాదులు అందాయి. మా సిబ్బంది అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. నిర్మాణం చట్టబద్ధమైందా? అనధికారికమైందా? అనేది పత్రాలను పరిశీలించిన తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటా'మని బదులిచ్చారు.

# ఆయిల్‌పామ్ డబ్బులు వేస్తున్నాం

**డీహెచ్‌ఎస్‌వో సంగీతలక్ష్మి**

నమస్తే ఎఫెక్ట్

హనుమకొండ సబర్బన్, మార్చి 26 : ఆయిల్‌పామ్ రైతుల బ్యాంకు ఖాతాల్లో త్వరలో మెయింటనెన్స్ డబ్బులను జమ చేసే ప్రక్రియ పూర్తవుతుందని వరంగల్ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి తెలిపారు. ఈ పంట సాగు చేసిన రైతులకు సబ్సిడీ నిధులు ఇవ్వని విషయమై బుధవారం 'నమస్తే తెలంగాణ'లో 'ఆయిల్ పామ్ సబ్సిడీ రాలే' శీర్షికన ప్రచురితమైన కథనానికి డీహెచ్‌ఎస్‌వో స్పందించి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లాకు 2024-25 సంవత్సరానికి 5,374 ఎకరాలకు గాను 1,666 మంది రైతులకు చెల్లించాల్సిన రూ.2.22 కోట్లను డీటీవో ద్వారా చెల్లించేందుకు కలెక్టర్ అనుమతి తీసుకున్నామని చెప్పారు. ఇందులో 1,619 మంది రైతులకు రూ.2.16 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. కేవలం 47మంది రైతులకు రూ.5,75,085 చెల్లించాల్సి ఉందని, ఈ నెల 31లోగా రైతులందరి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు.

### చలివాగే ఆధారం

అంకుశాపురం గ్రామానికి చలివాగే ఆధారం. అందులో నీళ్లు లేకపోవడంతో గ్రామస్తులు అటు సాగు, ఇటు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చెక్ డ్యాం పనికిరాకుండా పోయింది. రైతులు వాగులో పూడిక తీస్తూ, బోర్లు వేసుకుంటూ నీటి కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా ఎంతో కొంత వచ్చే నీటితో పంట పొలాలకు నీరందిస్తూ కాపాడుకుంటున్నారు. కొంత పొలం ఎండిపోయినా ఉన్నదానినైనా బతికించుకుందామని ఆరాట పడుతున్నారు. సరిగ్గా పంట చేతికొచ్చే సమయంలో నీటి కరువు రావడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. మరో 15 రోజులైతే ఈ మాత్రం నీళ్లు దొరకవని వాపోతున్నారు.



అంకుశాపూర్‌లో తాగునీటి బావిలోకి మోటర్ల ద్వారా నీరు నింపుతున్న దృశ్యం




### సాగునీరందించలేని దుస్థితిలో సర్కారు

రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. మా ఊరిని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. మరి ఇక్కడ అభివృద్ధి ఏదీ? ప్రభుత్వం కనీసం సాగునీరు, తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉంది. ఎన్నడూ ఇంత కరువు రాలేదు. ఇప్పుడు చలివాగులో చుక్క నీరు లేదు. అందులో బోర్లు వేస్తున్నాం. అయినా నీరు సరిపోవడం లేదు. పంటలు సగానికి పైగా ఎండిపోయాయి. గత కాంగ్రెస్ పాలన ఇప్పుడు మళ్లీ గుర్తుకు వస్తున్నది.

- కౌడగాని రాజేంద్రప్రసాద్, రైతు

నీరు లేక ఎడారిలా కనిపిస్తున్న చలివాగు





# చివరి తడికి గట్టెక్కేదెలా?

*జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండలం అంకుశాపూర్ గ్రామంలో పంట పొలాలకు సాగునీరందక రైతులు రోదిస్తున్నారు. ప్రభుత్వం ఎంపిక చేసుకున్న పైలట్ గ్రామంలో పథకాల అమలు దేవుడెరుగు. కనీసం పంట చేతికొచ్చే దశలో చి'వరి' తడికి గట్టెక్కేదెలా అని మదనపడుతున్నారు. సర్కారు సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఊహించని విధంగా చలివాగు పూర్తిగా ఎండిపోయి చుక్క నీరు లేక ఎడారిని తలపిస్తుండడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వాగులో బోర్లు వేస్తూ పూడికతీస్తూ భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. తాగునీటికి సైతం గ్రామస్తులు తండ్లాడుతున్నారు.*

- జయశంకర్ భూపాలపల్లి, మార్చి 26(నమస్తే తెలంగాణ)

### దిక్కుతోచని స్థితిలో రైతులు

- ధాన్యం చేతికొచ్చే దశలో ఎండుతున్న పంటలు
- నీళ్లు లేక నెర్రెలు బారుతున్న పొలాలు
- అంకుశాపూర్ గ్రామంలో 40 ఎకరాల్లో ఎండిన వరి
- చుక్కనీరు లేని చలి వాగులో భగీరథ యత్నం
- పైలట్ గ్రామంలో దయనీయ స్థితి

ఫీల్డ్ విజిట్

అంకుశాపురంలో ఇప్పటి వరకు సుమారు 40 ఎకరాల్లో వరి పంటలు నీరందక ఎండిపోయాయి. గ్రామంలో 311.34 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 683 మంది జనాభా ఉన్నారు. సుమారు 231 ఎకరాల్లో వరి, 70 ఎకరాల్లో మక్కజొన్న వేశారు. కాగా సాగు నీరు లేక భూములు నెర్రెలు బారి ఎండిపోయాయి. పంటలపై రైతులు ఆశలు వదులుకున్నారు. ఇక్కడ జనవరి 2023లో భూగర్భ జలాలు 1.93 మీటర్లు నమోదు కాగా, జనవరి 2024లో 2.64 మీటర్లకు పడిపోయాయి. ఫిబ్రవరి 2023లో 2.17 మీటర్లు ఉండగా, ఫిబ్రవరి 2024లో 2.93 మీటర్లు, జనవరి 2025లో 3.47 మీటర్లు, ఫిబ్రవరిలో 3.81 మీటర్లకు అడుగంటిపోయాయి. గ్రామంలోని తాగునీటి బావి సైతం ఎండిపోవడంతో వ్యవసాయ బోర్ల నుంచి నీటిని నింపుతూ గ్రామస్తులకు మంచినీటిని అందిస్తున్నారు.

### ఐదెకరాలు ఎండింది..



చలివాగు వెంట నేను 12 ఎకరాల వరి పంట వేసిన. ఇప్పటి వరకు నీళ్లు అందక ఐదెకరాలు ఎండిపోయింది. ఇంకా ఎంత ఎండిపోతదో ఏమో. బోర్ల ద్వారా కొంత వరకు పంటను కాపాడుకుంటున్నా. చలివాగులో ఎప్పుడూ పుష్కలంగా నీళ్లుండేవి. చెక్‌డ్యాం నిండుకుండలా ఉండేది. మా ఊరిలో సుమారు 40 ఎకరాలపైనే వరి పంట ఎండిపోయింది. ఇంకో నెల రోజులు గడిస్తే పరిస్థితి ఎలా ఉంటదో చూడాలి. సాగునీరందక చాలా నష్టపోయాం. మిషన్ భగీరథ నీరు సరిపోకపోవడంతో తాగునీరందించే బావిలోకి వ్యవసాయ మోటర్ల ద్వారా నీరు నింపి గ్రామస్తులకు అందిస్తున్నాం. కేసీఆర్ పాలనలో ఎప్పుడూ ఇలాంటి కరువు పరిస్థితులు రాలేదు.

- గాలి చంద్రమౌళి, మాజీ సర్పంచ్



చలివాగులో గుంత తీసి నీటిని మోటర్ల ద్వారా పొలాలకు పారించుకుంటున్న రైతులు

# రిజిస్ట్రేషన్ ఆఫీసులో ప్రైవేట్ హవా

- ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకోని సబ్ రిజిస్ట్రార్లు
- కంప్యూటర్ క్యాబిన్‌లోకి డాక్యుమెంట్ రైటర్స్

హనుమకొండ, మార్చి 26: హనుమకొండ వడ్డేపల్లి100 ఫీట్ల రోడ్డులోని వరంగల్ ఆర్వో కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల హవా కొనసాగుతున్నది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారిని తీసివేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశించినా ఇక్కడ అమలుకాకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారిని కలిస్తే కాని పని అవుతుందనే ప్రచారం జోరుగా సాగుతున్నది. కార్యాలయ సిబ్బంది వెళ్లిన తర్వాత కంప్యూటర్ క్యాబిన్‌లో డాక్యుమెంట్ రైటర్లను కూర్చోబెట్టి డాక్యుమెంట్ ఫీడింగ్, క్యాప్చర్ చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఏమైనా ఫైళ్లుగానీ, డాక్యుమెంట్లు పోతే ఎవరు బాధ్యులని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. తాజాగా బుధవారం ఓ డాక్యుమెంట్ రైటర్ కంప్యూటర్ క్యాబిన్‌లో కూర్చొని డాక్యుమెంట్ ఫీడింగ్, ఫొటో క్యాప్చరింగ్ చేశాడు. ప్రభుత్వ ఉద్యోగులు నిర్వర్తించాల్సిన విధులు ప్రైవేట్ వ్యక్తులు చేయడమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రైవేట్, డాక్యుమెంట్ రైటర్ల విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



కంప్యూటర్ క్యాబిన్‌లో కూర్చున్న డాక్యుమెంట్ రైటర్

**ప్రైవేట్ వ్యక్తులను ప్రోత్సహిస్తున్న సబ్ రిజిస్ట్రార్లు**

ఉద్యోగులు చేయాల్సిన పనులను సబ్ రిజిస్ట్రార్లు ప్రైవేట్ వ్యక్తులతో చేయించడంపై అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఈ విషయమై జిల్లా రిజిస్ట్రార్ ఫణీంద్రను ఫోన్‌లో సంప్రదించగా ప్రైవేట్ వ్యక్తులను తొలగించాలని ఇప్పటికే డీఐజీ, డీఆర్‌గా తాను చెప్పానన్నారు. అయినప్పటికీ మళ్లీ చెప్పి తొలగిస్తాం. కంప్యూటర్ క్యాబిన్‌లో డాక్యుమెంట్ రైటర్ ఉన్న విషయం తెలియదు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా జాయింట్ -1 సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌ను సైతం ఫోన్లో సంప్రదించగా సాయంత్రం ఇంటర్‌నెట్ సమస్య వచ్చింది. నెట్ రాగానే డాక్యుమెంట్ పూర్తి చేశాం. రైటర్ కంప్యూటర్ క్యాబిన్‌లో ఉన్నట్లు నాకు తెలవడంతోనే వెంటనే పంపించి కార్యాలయ ఉద్యోగితో దస్తావేజుల ప్రక్రియ కొనసాగించాం. పాత ఫైల్స్ అన్ని అప్పగించిన తర్వాత ప్రైవేట్ వ్యక్తులందరినీ తొలగించాం. ఇప్పుడు ఎవరూ లేరు.



డ్యాన్స్ చేస్తున్న ఫరియా అబ్దుల్లా

# చిట్టి.. స్టెప్పులతో అదరగొట్టి!

**నగరంలో సినీనటి ఫరియా అబ్దుల్లా సందడి..**

హనుమకొం డ నగరంలో సినీనటి, జాతిరత్నాలు ఫేమ్ చిట్టి( ఫరియా అబ్దుల్లా) సందడి చేసింది. బుధవారం రాత్రి 7గంటలకు గోకుల్‌నగర్‌లో ఓ రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె స్టేజీపై స్టెప్పులు వేసి అందరినీ అలరింపజేసింది. ఈ సందర్భంగా చిట్టి మాట్లాడుతూ గతంలో వరంగల్ నగరానికి వచ్చానని, హనుమకొండకు రావడం ఇదే మొదటిసారన్నారు. కాగా ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. - హనుమకొండ, మార్చి 26

# నల్లబెల్లిలో మాస్ కాపీయింగ్

**ఏడుగురు ఇన్విజిలేటర్ల తొలగింపు**

నల్లబెల్లి, మార్చి 26 : టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు గుర్తించి ఏడుగురు ఇన్విజిలేటర్లను తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌తోపాటు కారుణ్య జ్యోతి పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. జడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షలో ఓ విద్యార్థి టాయిలెట్‌కని చెప్పి పాఠశాలలోని బాత్‌రూంకు వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్ వచ్చి నకల్ చీటీల విషయంలో చెక్ చేశారు. బాత్‌రూమ్‌కు వెళ్లి వచ్చిన విద్యార్థిని చెక్ చేయగా అతడి జేబులో చీటీల కట్ట కనిపించింది. సదరు విద్యార్థిని ఆరా తీసిన అనంతరం బాత్రూమ్‌ను పరిశీలించగా కుప్పలుగా నకల్ చీటీలు వెలుగు చూశాయి. దీనిపై సంబంధిత ఫ్లయింగ్ స్క్వాడ్స్ డీఈవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. స్పందించిన డీఈవో జ్ఞానేశ్వర్ నల్లబెల్లి పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు గుర్తించి ఏడుగురు ఇన్విజిలేటర్లను తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై ఎంఈవో అనురాధను వివరణ కోరగా జడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న ఇన్విజిలేటర్లను తొలగించి వారి స్థానంలో వేరే వారిని నియమించినట్లు తెలిపారు. నకల్ చీటీలతో పట్టుపడిన విద్యార్థి ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్టూడెంట్ కావడంతో అతడిని కాపాడేందుకు జిల్లా విద్యాశాఖలో పెద్ద రాజకీయమే జరిగినట్లు సమాచారం.

# చంద్రశిల పర్వతాన్ని అధిరోహించిన కమలాపూర్‌వాసి

కమలాపూర్, మార్చి 26: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన మౌటం మురళీకృష్ణ భారతదేశంలోని చంద్రశిల పర్వతాన్ని అధిరోహించినట్లు బుధవారం తెలిపారు. సముద్ర మట్టానికి 3690 మీటర్ల ఎత్తు, 12,110 అడుగుల ఎత్తులో ఉన్న చంద్రశిల పర్వతం అధిరోహిస్తే హిమాలయాలను చూడవచ్చన్నారు. చంద్రశిల శిఖరానికి చేరుకునే ఐదు కిలోమీటర్ల ముందు చోప్తా, తుంగ్నాథ్ అనే ప్రపంచంలోనే ఎత్తయిన శివాలయం వస్తుందన్నారు. చంద్రశిల పర్వతాన్ని విదేశీయులతో కలిసి మురళీకృష్ణ అధిరోహించారు.



చంద్రశిల పర్వతంపై మౌటం మురళీకృష్ణ

# 'మినీ మేడారం' ఆదాయం రూ. 1.8 కోట్లు

**జాతరలో ఏర్పాటు చేసిన 54 హుండీల లెక్కింపు**

తాడ్వాయి, మార్చి 26 : గత ఫిబ్రవరిలో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన మేడారం మినీ జాతర ఆదాయం రూ. 1,8,03,173 సమకూరింది. జాతరను పురస్కరించుకొని సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలపై 54 హుండీలను దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పలు జిల్లాలకు చెందిన భజన మండలి సభ్యులు పూజారులు, రెవెన్యూ, పోలీస్, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీల సీళ్లను తొలగించి లెక్కింపును ప్రారంభించారు. సమ్మక్క హుండీల్లో రూ. 58,66,409, సారలమ్మ హుండీల్లో రూ. 41,61,892, పగిడిద్దరాజు హుండీల్లో రూ. 1,61, 003, గోవిందరాజు హుండీల్లో రూ. 2,13,869 లభించాయి. ఈ మొత్తాన్ని మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు.

# అవినీతిపై సైనికుడిలా పోరాడాలి

- లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ
- తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఎన్పీడీసీఎల్ డీఈలను ఏసీబీకి పట్టించిన పౌరులకు నగదు పురస్కారాలతో సన్మానం

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : సమాజాన్ని పట్టి పీడిస్తున్న అవినీతిని అంతం చేయాలంటే ప్రతి పౌరుడు సరిహద్దులోని సైనికుడిలా పోరాడాలని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ పిలుపునిచ్చారు. అవినీతిపై పోరాటం చేయడం ప్రతి ఒక్కరూ ప్రథమ కర్తవ్యంగా భావించాలని యువతను కోరారు. అవినీతి వ్యతిరేక సంస్థ 'జ్వాల' ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని లోక్‌సత్తా జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణను ఏసీబీకి పట్టించిన శివరాజ్, హనుమకొండ జిల్లా కమలాపూర్ తహసీల్దార్ మాధవిని ఏసీబీకి పట్టించిన గోపాల్, ఎన్పీడీసీఎల్ స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ హుస్సేన్‌నాయక్‌ను పట్టించిన విజయ్‌లను జ్వాలా ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో ప్రభుత్వాలు మారుతున్నా అవినీతి మాత్రం తగ్గడం లేదన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడే వారిని సన్మానిస్తూ, ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్న జ్వాల వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్‌ను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. అత్యంత అవినీతి కలిగిన దేశాల్లో భారత్ 96వ స్థానంలో ఉన్నదని, ఏటా మరింత పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నదని ప్రశాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఏసీబీకి చిక్కిన ప్రభుత్వ అధికారులను ప్రభుత్వం వెంటనే విధుల నుంచి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర సలహాదారులు ప్రొఫెసర్ కోదండరామారావు, డాక్టర్ అంజలి దేవి, జ్వాల సభ్యులు అచ్చే అమర్నాథ్, ప్రకాశ్, సురేశ్ పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టించిన వారిని సన్మానిస్తున్న జయప్రకాశ్ నారాయణ